సాక్షి
సిద్దిపేట
గురువారం । 30 । నవంబర్ । 2023



సిద్దిపేట ఇందూరు కళాశాలలో అధికారులు అందించిన సామగ్రిని సరిచూసుకుంటున్న ఎన్నికల సిబ్బంది

నియోజకవర్గం	పోలింగ్‌కేంద్రాలు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
హుస్నాబాద్	304	1,19,761	1,22,412	04	2,42,177
సిద్దిపేట	273	1,15,346	1,18,317	70	2,33,733
దుబ్బాక	253	97,019	1,01,081	0	1,98,100
గజ్వేల్	321	1,36,294	1,38,353	07	2,74,654

రండి.. ఓటేద్దాం

జిల్లాలో ఓటర్లు:	9.48లక్షలు
పోలింగ్ కేంద్రాలు:	1,151
పోలింగ్ సిబ్బంది:	5,421
ఎన్నికల బరిలో ఉన్నవారి సంఖ్య:	95



ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రానికి..



సామగ్రితో తరలుతున్న ఎన్నికల సిబ్బంది

నేడే పోలింగ్.. సర్వం సిద్ధం

- ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు..
- పోలీస్ అధికారులు, సిబ్బందిచే పటిష్ట బందోబస్తు

సాక్షి, సిద్దిపేట: శాసన సభ ఎన్నికలకు గురువారం పోలింగ్ జరగనుంది. అధికారులు సర్వం సిద్ధం చేశారు. హుస్నాబాద్, సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ నియోజకవర్గాల్లో మొత్తం 95 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,151 పోలింగ్ కేంద్రాల్లో 9,48,664 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. సిద్దిపేటలో ఇందూరు ఇంజనీరింగ్ కళాశాల, హుస్నాబాద్‌లో మోడల్ స్కూల్, దుబ్బాకలో లచ్చపేట మోడల్ స్కూల్, గజ్వేల్‌లో ఐఓసీ బిల్డింగ్ ఆవరణలో పోలింగ్ సిబ్బందికి సామగ్రిని పంపిణీ చేశారు.

పకడ్బందీ ఏర్పాట్లు..

ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఇందు కోసం ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కోసం 5,421 సిబ్బందిని నియమించారు. ఇందులో పీఓలు 1,151, ఏపీఓలు 1,151, ఓపీఓలు 2,302తో పాటు రిజర్వ్‌గా 817 మంది ఉన్నారు.

బరిలో 95 మంది

నాలుగు నియోజకవర్గాలలో 95 మంది బరిలో ఉన్నారు. హుస్నాబాద్- 19, సిద్దిపేట-21, దుబ్బాక -11, గజ్వేల్- 44 మంది ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు. ఇప్పటికే ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించిన అభ్యర్థులు తమకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు.

నిఘా ముమ్మరం

జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.10 డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. వివిధ రాష్ట్రాల, స్థానిక పోలీస్ సిబ్బంది, కేంద్ర బలగాలు, రైల్వే పోలీస్ అధికారులు, సిబ్బంది మొత్తం 2,632 మందితో బందోబస్తును నిర్వహించనున్నారు. జిల్లాలో 278 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. 103 మొబైల్ పార్టీలు, క్విక్ రెస్పాన్స్ టీమ్స్ 26, స్ట్రైకింగ్ ఫోర్స్ 6, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌ను నియమించినట్లు సీపీ శ్వేత తెలిపారు.

న్యూస్‌రీల్

మోడల్ పోలింగ్ కేంద్రం ముస్తాబు



మద్దూరులో మోడల్ పోలింగ్ కేంద్రం

మద్దూరు(హుస్నాబాద్): అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రం -80ను మోడల్ కేంద్రంగా అధికారులు ముస్తాబు చేశారు. కొబ్బరి, మామిడి కొమ్మలతో స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. కేంద్రం లోపల సైతం అందంగా తీర్చిదిద్దారు. మండల కేంద్రంలోని మరో పోలింగ్ బూత్‌ను మహిళా పోలింగ్ బూత్‌గా ఎన్నికల అధికారులు ప్రకటించారు.

జాతీయ యోగా పోటీలకు విద్యార్థిని ఎంపిక



వైష్ణవిని అభినందిస్తున్న పీఈటీ గోవర్ధన్‌రెడ్డి

గజ్వేల్‌రూరల్: జాతీయ యోగా పోటీలకు గజ్వేల్ పట్టణం ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన యోగా క్రీడాకారిణి నాయిని వైష్ణవి ఎంపికైంది. ఈ నెల 20న జరిగిన మహాత్మా గాంధీ యూనివర్సిటీ స్థాయి యోగాసనాల పోటీలలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. నల్లగొండ జిల్లా గోపాల కృష్ణ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీలో యూజీడీపీఈడీ కోర్సును అభ్యసిస్తున్న వైష్ణవి తమిళనాడులోని చెన్నై అన్నా యూనివర్సిటీలో డిసెంబర్ ఒకటి నుంచి 4 వరకు జరిగే జాతీయ యోగా పోటీల్లో పాల్గొననుంది. జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైన వైష్ణవిని పీఈటీ గోవర్ధన్ రెడ్డి అభినందించారు.

ఓటు హక్కు మరవొద్దు

- బాధ్యతాయుతంగా ఓటేయండి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్



సిద్దిపేటరూరల్: ఓటర్లు నిర్భయంగా, నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా ఓటు వేసేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ బుధవారం తెలిపారు. ఓటు హక్కు కలిగిన ప్రతి పౌరుడు వినియోగించుకోవడం బాధ్యత అన్నారు. ఓటు ప్రాధాన్యతపై విస్తృతంగా అవగాహన కల్పించామని, ఓటరు కార్డు, స్లిప్పులు లేకపోయినా ఎన్నికల సంఘం గుర్తించిన 12 రకాల గుర్తింపు కార్డులలో ఏదో ఒక దానిని తీసుకుని వెళ్లి ఓటు వేయాలని కోరారు. గురువారం ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 వరకు పోలింగ్ కొనసాగుతుందన్నారు. నిర్ణీత సమయంలో పోలింగ్ కేంద్రానికి చేరుకున్న అందరికీ ఓటు వేసేందుకు అనుమతిస్తామన్నారు. పోలింగ్ ముగిసే వరకు సైలెంట్ పీరియడ్ పాటించాలన్నారు. సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గ పరిధిలో ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పుకార్లను నమ్మొద్దని, ఎవరైనా ఓటర్లను భయభ్రాంతులకు గురుచేస్తే సమీపంలోని పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు.

చింతమడకలో ఓటేయనున్న కేసీఆర్ దంపతులు

హెలిప్యాడ్‌ను పరిశీలించిన మంత్రి హరీశ్

సాక్షి, సిద్దిపేట: బీఆర్ఎస్ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ తన స్వగ్రామం చింతమడకలో ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. సిద్దిపేటలోని చింతమడకలో కేసీఆర్‌తో పాటు సతీమణి శోభ సైతం ఓటు వేయనున్నారు. ఇందు కోసం చింతమడకలో హెలిప్యాడ్‌ను సిద్ధం చేశారు. ఈ ఏర్పాట్లను ఆర్థిక వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు ఏర్పాట్లను పరిశీలించారు. సిద్దిపేటలోని భారత్‌నగర్‌లో అంబిటాస్ స్కూల్‌లో మంత్రి హరీశ్ రావు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.



చింతమడకలో హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి హరీశ్ రావు

